




# EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
16 మే 2024
పేజీలు: 02





634 రన్స్ 22 వికెట్స్

## పాయింట్స్ టేబుల్

| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| Qualifed కోల్‌కతా | 13 | 9 | 3 | 1.42 | 19 |
| రాజస్తాన్ | 13 | 8 | 5 | 0.27 | 16 |
| చెన్నై | 13 | 7 | 6 | 0.52 | 14 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 0.40 | 14 |
| ఢిల్లీ | 14 | 7 | 7 | -0.37 | 14 |
| బెంగళూరు | 13 | 6 | 7 | 0.38 | 12 |
| లక్నో | 13 | 6 | 7 | -0.78 | 12 |
| Eliminated గుజరాత్ | 13 | 5 | 7 | -1.06 | 11 |
| పంజాబ్ | 13 | 5 | 8 | -0.34 | 10 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |

## నేటి మ్యాచ్

హైదరాబాద్ X గుజరాత్

హైదరాబాద్, రా.7.30



## 18న తెలంగాణ కేబినెట్ సమావేశం

8న తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగనుంది. అయితే.. ఇవాళ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలతో పాటు రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చించారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి సీఎం వెంట ఉన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు రుణమాఫీకి అవసరమైన నిధులను సమీకరించేందుకు ఉన్న వివిధ మార్గాలను అధికారులతో చర్చించారు. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి విధి విధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.





# చరిత్ర సృష్టించబోతున్నాం

## ప్రశాంత్ కిశోర్ ఆలోచించలేనన్ని సీట్లు గెలుస్తాం

**ఐప్యాక్ టీంతో జగన్**

### ఎన్నికల తర్వాత యావత్ దేశం మనవైపు చూస్తుందని వ్యాఖ్య




ఏపీలో వైసీపీ మరోసారి ప్రభంజనం సృష్టించబోతోందని సీఎం జగన్ అన్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి రాబోతోందని చెప్పారు. గత ఎన్నికల కంటే వైసీపీ అధిక సీట్లలో గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. మనం చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. విజయవాడ బెంజ్ సర్కిల్ లో ఉన్న ఐప్యాక్ కార్యాలయానికి జగన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ఫలితాలను అంచనా వేశారు. దాదాపు అరగంట సేపు ఐప్యాక్ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లు, 22 ఎంపీ సీట్లను గెలిచామని... ఈసారి అంతకన్నా ఎక్కువ సీట్లు గెలుస్తామని జగన్ అన్నారు. ప్రశాంత్ కిశోర్ ఆలోచించలేనన్ని సీట్లు మనకు వస్తాయని చెప్పారు. జూన్ 4వ తేదీన వచ్చే ఫలితాల తర్వాత యావత్ దేశం మనవైపు చూస్తుందని అన్నారు. వచ్చే ప్రభుత్వంలో ప్రజలకు మరింత మేలు చేద్దామని చెప్పారు. రానున్న రోజుల్లో వైసీపీ, ఐప్యాక్ ప్రయాణం ఇలాగే ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల్లో వైసీపీ కోసం ఐప్యాక్ పొలిటికల్ కన్సల్టెంట్ గా పని చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల తరువాత తొలిసారి స్పందించిన జగన్..తిరిగి సంచలన విజయం నమోదు చేయబోతున్నామని చెప్పారు. ప్రజలు సుపరిపాలనను చూసి మద్దతు ఇచ్చారని జగన్ వివరించారు. ఐ ప్యాక్ టీమ్ సేవలు వెలకట్టలేనివన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలన అందించామని వ్యాఖ్యానించారు. ఐప్యాక్ సేవలను పరిపాలనలోనూ ఉపయోగించామన్నారు. ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు మాటమార్చారని జగన్ పేర్కొన్నారు. ప్రశాంత్ కిషోర్ కలలోకూడా ఊహించని ఫలితాలు చూస్తామని జగన్ వివరించారు. ఫలితాలతో దేశంలోని ప్రతీ నేత ఏపీ వైపే చూస్తారని జగన్ ధీమాగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు జగన్ గెలుపుపైన చేసిన కామెంట్స్..సీట్ల గురించి చెప్పిన లెక్కలతో ఏపీలో ఫలితాలపైన కొనసాగుతున్న ఉత్కంఠ వేళ సంచలనంగా మారింది.



## మాట నిలబెట్టుకున్న సీఎం వైయస్ జగన్

డీబీటీ పథకాల నిధుల విడుదలకి గత వారం ఏపీ హైకోర్టు అనుమతించినా.. కుట్రపూరితంగా అడ్డుకున్న చంద్రబాబు. పోలింగ్ తర్వాత అకౌంట్లలో డబ్బులు వేస్తామని లబ్ధిదారులకి హామీ ఇచ్చిన జగనన్న మాట ప్రకారం ఆసరా కింద అక్క చెల్లెమ్మల అకౌంట్లలో రూ.1480 కోట్లు, జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి రూ.502 కోట్లు విడుదల.



## సింగపూర్ నూతన ప్రధానిగా లారెన్స్ వాంగ్

సింగపూర్ నాలుగో ప్రధానమంత్రిగా ఆర్థికవేత్త లారెన్స్ వాంగ్ (51) బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈయనకు ముందు రెండు దశాబ్దాలపాటు లీ సీన్ లూంగ్ (71) ప్రధానిగా వ్యవహరించగా, వాంగ్ ఉప ప్రధాని పదవి నిర్వహించారు. వీరిద్దరూ పాలక పీపుల్స్ యాక్షన్ పార్టీకి చెందినవారే. వాంగ్ ప్రధాని పదవితోపాటు ఆర్థిక మంత్రి పదవినీ నిర్వహిస్తారు. దేశాధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం (67) వాంగ్‌తో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయించారు. లూంగ్ ప్రభుత్వంలోని మంత్రులు అందరూ వాంగ్ సర్కారులోనూ అవే పదవులు నిర్వహించనున్నారు. 2025 నవంబరులో సింగపూర్ పార్లమెంటు ఎన్నికలు జరిగిన తరువాతే మంత్రివర్గంలో మార్పులు చోటు చేసుకుంటాయి.



## ఢిల్లీ బయల్దేరిన ఏపీ సీఎస్, డీజీపీ

ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై ఎన్నికల సంఘం ఆగ్రహించింది. దీనిపై ఢిల్లీ వచ్చి వివరణ ఇవ్వాలని సీఎస్, డీజీపీని ఆదేశించింది.

## ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది మృత్యువాత




ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఘటాబిల్లౌడ్ సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిది మంది వ్యక్తులతో వెళ్తున్న కారు అతివేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న డంపర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. కారులో వ్యక్తులంతా అందులోనే ఇరుకుపోయారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారులోని వ్యక్తులను బయటకు తీసేందుకు యత్నించారు. వేగంగా ఢీకొట్టడంతో ఎనిమిది మంది మృతి చెందారు. మృతదేహాలు కారులోనే ఇరుక్కుపోయాయని.. మరో వ్యక్తి గాయపడ్డారని మధ్యప్రదేశ్ పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలో ఇసుక చెల్లాచెదురుగా పడిపోయింది. మృతులు భాగ్‌తండా నుంచి గుణకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.



## కొడుకుపై తల్లి పోటీ

బిహార్‌లోని కారాకట్ లోక్‌సభ నియోజకవర్గంలో భోజ్‌పురి సింగర్, నటుడు పవన్‌సింగ్‌పై తన తల్లి ప్రతిమాదేవి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ స్వతంత్ర అభ్యర్థులే. తొలుత బెంగాల్‌లోని అసన్‌సోల్ అభ్యర్థిగా పవన్‌సింగ్‌ను BJP ప్రకటించింది. దీనిపై అభ్యంతరాలు రావడంతో పవన్ పోటీ నుంచి తప్పుకొని, కారాకట్ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. అయితే.. అక్కడా NDA అభ్యర్థి బరిలో ఉండటంతో.. పోటీ నుంచి తప్పుకోవాలని BJP హెచ్చరించింది.



## శ్రీశైలం వెళ్తుండగా బొలెరో వాహనం బోల్తా..

### 15 మంది భక్తులకు గాయాలు

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చిన్నారుట్ల చెంచుగూడెంలో సమీపంలో ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పేలకుర్తి గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. దాదాపు 25 మంది భక్తులు బుధవారం రాత్రి 2 బొలెరో వాహనాల్లో శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం కోసం బయల్దేరి వెళ్లారు. శ్రీశైలానికి 15 కిమీ దూరంలో అందులోని ఒక వాహనం బోల్తా పడింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



## క్షమాపణలు చెప్పమంటున్న మెహరీన్

హీరోయిన్ మెహరీన్ పిర్జాదా ఇటీవల 'ఎగ్ ఫ్రీజింగ్' గురించి వివరిస్తూ ఓ పోస్ట్ పెట్టిన సంగతి తెలిసిందే. ఐతే, తన కామెంట్స్ పై కొందరు తప్పుడు వార్తలు రాశారు అని తాజాగా మెహరీన్ అసహనం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో మెహరీన్ ఇంకా మాట్లాడుతూ... 'తప్పుడు వార్తలను ప్రజలకు అందించడం అనైతికం. పైగా చట్ట విరుద్ధం కూడా. ఇటీవల నేను పెట్టిన 'ఫ్రీజింగ్ ఎగ్స్' పోస్ట్‌పై కొందరు రకరకాల తప్పుడు వార్తలు రాసి, నన్ను ఇబ్బంది పెట్టారు. మెహరీన్ ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి నేను ధైర్యం చేసి ఆ విషయం గురించి చెప్పాను. ఫ్రీజింగ్ ఎగ్స్ కోసం అమ్మాయిలు గర్భవతులు కావాల్సిన అవసరం ఏముంది ?, బాధ్యతయుతమైన సెలబ్రిటీగా కొందరికి దీని గురించి అవగాహన కల్పించడం కోసం నేను ఆ విధంగా కామెంట్స్ పెట్టాను. పిల్లలు అప్పడే వద్దని భావించే తల్లి దండ్రులకు ఎగ్ ఫ్రీజింగ్ పద్ధతి ఎంతో మేలు చేస్తోంది. ఇవన్నీ ఆలోచించకుండా నా పై తప్పడు కథనాలు రాశారు. నాపై పెట్టిన పోస్ట్‌లను తొలగించి, నాకు బహిరంగ క్షమాపణలు చెప్పండి' అంటూ మెహరీన్ చెప్పుకొచ్చింది. మెహరీన్ కి, హరియాణ మాజీ ముఖ్యమంత్రి భజన్ లాల్ మనవడు భవ్య బిష్ణోయ్ తో నిశ్చితార్థం జరిగాక, వారిద్దరూ విడిపోయిన సంగతి తెలిసిందే.



## ప్రధాని రాబర్ట్ ఫికోపై కాల్పులు.. ఖండించిన బైడెన్, పుతిన్

స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికోపై జరిగిన దాడిని ప్రపంచ నేతలు ఖండించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఫికో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బుధవారం హ్యాండ్లోవాలో బుధవారం ఫికోపై కాల్పులు జరిగిన విషయం తెలిసింది. ప్రస్తుతం ఆయన బన్స్కా బిస్ట్రికా నగరంలో చికిత్స పొందుతున్నాడు. కాల్పులు జరిపిన వ్యక్తిని అక్కడికక్కడే అరెస్టు చేసి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. ఈ దాడిని అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ఖండించారు. ఫికో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'తమ ఆలోచలన్నీ ఆయన కుటుంబం, స్లోవేకియా ప్రజలతోనే ఉన్నాయి. త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ భయంకరమైన హింసాత్మక చర్యను ఖండిస్తున్నాం. ఎంబసీ స్లోవేకియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది' అంటూ బైడెన్ ట్వీట్ చేశారు. బ్రిటన్ ప్రధాని రిషి సునక్ కూడా సైతం స్పందించారు. ఘటన గురించి విని షాక్ అయ్యానని ట్వీట్ చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫికోపై దాడిని ఖండిస్తూ ఖండించారు. దాడి ఘటనను 'రాక్షసమైన నేరం'గా అభివర్ణించారు. ఫికో ధైర్యవంతుడని.. దృఢమైన వ్యక్తి అని తెలుసునన్నారు. లక్షణాలు అతనికి క్లిష్ట పరిస్థితిని తట్టుకోవడంలో సహాయపడతాయన్నారు. ఫికో త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.



# భారత్ చంద్రుడిపై అడుగుపెడుతుంటే.. మన పిల్లలు మురికి కాలువల్లో పడి చస్తున్నరు..

## పాక్ ఎంపీ సయ్యద్ ముస్తాఫా కమల్ వ్యాఖ్యలు

ఓ వైపు భారత్ చంద్రుడిపై అడుగుపెడుతుంటే.. పాక్‌లో పిల్లలు గట్టర్లలో పని చనిపోతున్నారని పాకిస్థాన్ ఎంపీ సయ్యద్ ముస్తాఫా కమల్ అన్నారు. పాకిస్థాన్ రాజకీయ పార్టీ ముత్తాహిదా క్వామీ మూవ్‌మెంట్ పాకిస్థాన్ ఎంపీ సయ్యద్ ముస్తఫా కమల్ పాకిస్థాన్ పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ దేశ సమస్యలను ప్రస్తావించారు. బుధవారం జాతీయ అసెంబ్లీలో మాట్లాడారు. 'ప్రపంచం చంద్రుడి మీదకు వెళ్తున్నది. ఇక్కడ కరాచీ పరిస్థితి ఏంటంటే.. చాలామంది చిన్నారులు తెరిచిన మురికి కాల్వల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అదే సమయంలో భారత్ చంద్రుడిపై ల్యాండ్ అయిందన్న వార్తలు వస్తున్నాయి.ఇక్కడ కరాచీలో ఓ పిల్లాడు కాలువలో పడి మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. ప్రతీ మూడో రోజూ ఇలాంటి వార్తలు సర్వసాధారణంగా మారాయి' అంటూ పాక్‌లోని పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కరాచీలోని మంచినీటి కొరతపై స్పందించారు. 'కరాచీ పాకిస్థాన్‌కు ఆదాయ ఇంజిన్. దేశంలో రెండు ఓడరేవులు ఉన్నాయి. రెండూ కరాచీలోనే ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఇది దేశానికి గేట్‌వే. కరాచీకి 15 ఏళ్లుగా పరిశుభ్రమైన మంచినీరు అందడం లేదు. మంచినీళ్ల ట్యాంకు సైతం చోరీకి గురవుతున్నాయి. నీటి మాఫియా ట్యాంకుల నీళ్లు కరాచీ ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటుంది' అన్నారు. సింధ్ ప్రావిన్స్‌లో దాదాపు 70లక్షల మంది పిల్లలు పాఠశాలలకు వెళ్లడం లేదని.. జాతీయ స్థాయిలో 2.6కోట్లుగా ఉందన్నారు. కరాచీ సింధ్ ప్రావిన్స్ రాజధాని. 48వేల పాఠశాలలున్నాయని.. 11వేల పాఠశాలలు ఖాళీగా ఉన్నట్లు నివేదిక తెలుపుతుందని.. దేశంలో 2.62 కోట్ల మంది పిల్లలు బడికి వెళ్లడం లేదని.. ఇది 70 దేశాల్లోని జనాభా కంటే ఎక్కువని వాపోయారు. చదువుకోని పిల్లలు దేశ ఆర్థికాభివృద్ధి మొత్తాన్ని నాశనం చేస్తున్నారని కమల్ పేర్కొన్నారు. మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. భారత్, పాకిస్థాన్ కలిసి స్వాతంత్ర్యం పొందాయని.. కానీ నేడు (భారత్) అగ్రరాజ్యంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు.. తాము కలలు కంటున్నామన్నారు. ఈ క్రమంలోనే ముస్తాఫా కమల్ స్పందించారు.



## ప్రధానిపై పోటీ.. కమెడియన్ శ్యామ్ రంగీలాకు షాక్

ఉత్తరప్రదేశ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్న వారణాసి లోక్‌సభ స్థానం నుంచి ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్, కమెడియన్ శ్యామ్ రంగీలా పోటీకి దిగిన సంగతి తెలిసిందే. ఆయన నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోనే ఆయన నామినేషన్ పత్రాలను తిరస్కరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన శ్యామ్ రంగీలా.. ప్రధాని మోదీ గొంతును అనుకరిస్తూ సోషల్ మీడియాలో పాపులర్ అయ్యారు. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగి వార్తల్లో నిలిచారు. అయితే, నామినేషన్ సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని రెండు రోజుల క్రితం ఆరోపించారు. తొలుత మే 10, 13వ తేదీల్లో నామినేషన్ వేయడానికి ప్రయత్నించగా.. తన పత్రాలను ఎవరూ తీసుకోలేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అనంతరం చివరి రోజైన మే 14న నామినేషన్ వేయడానికి వెళ్లగా.. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. అనేక ప్రయత్నాల అనంతరం ఎట్టకేలకు నామినేషన్ల ముగింపు గడువుకు రెండు నిమిషాల ముందు మధ్యాహ్నం 2.58 గంటలకు నామినేషన్ వేసినట్లు చెప్పారు. అయితే, మరుసటి రోజు ఎన్నికల అధికారులు నామినేషన్లను పరిశీలించి శ్యామ్ రంగీలా పత్రాలను తిరస్కరించారు. నామినేషన్ సంపూర్ణంగా లేదని, అఫిడవిట్‌పై ప్రమాణం చేయలేదని అధికారులు పేర్కొన్నారు. కాగా.. అధికారుల తీరును కమెడియన్ తీవ్రంగా తప్పుబట్టారు. ఉద్దేశపూర్వకంగానే తన పత్రాలను తిరస్కరించారని ఆరోపించారు.

## చంద్రగిరి అల్లర్లు.. పోలీసుల అదుపులో 30 మంది!

చంద్రగిరి అల్లర్ల కేసులో 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ఫిర్యాదుతో హత్యాయత్నంతో పాటు పలు కేసులు నమోదు చేశారు. ఇటు రామిరెడ్డి పల్లి, కూచివారిపల్లెలో పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. కాగా మంగళవారం తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని వెళ్లగా.. అక్కడ ఆయనపై పలువురు దాడి చేశారు.



## జాగ్రత్తలు తీసుకోకపోతే ఇంటి ఫుడ్డూ డేంజరే: ICMR

ఇంట్లో వండుకునే ఆహారమైనా సరే తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమని ICMR తాజా మార్గదర్శకాల్లో తెలిపింది. కొవ్వు, చక్కెర, ఉప్పు, నూనె అధికంగా ఉంటే ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరించింది. రోజుకు ఉప్పు 5 గ్రాములు, చక్కెర 25 గ్రాములు మించరాదని స్పష్టం చేసింది. విటమిన్లు, మినరల్స్, పీచు పదార్థం అధికంగా ఉండే ఆహారాన్నే ప్రజలు ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొంది.







## హెపటైటిస్ ఎ వైరస్ విజృంభణ.. 12 మంది మృతి

కేరళలో హెపటైటిస్ ఎ వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్‌తో ఇప్పటికే 12 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో 1,977 కేసులు బయటపడ్డాయి. ఈ క్రమంలో అత్యధిక కేసులు నమోదైన కోజికోడ్, మలపురం, త్రిసూర్, ఎర్నాకులం జిల్లాలకు రాష్ట్ర ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో వైరస్ కట్టడికి క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఇక శ్రీలంకలోనూ ఫోన్ పే!




యూపీఐ లావాదేవీ సంస్థ ఫోన్ పే శ్రీలంకలో సేవల్ని ప్రారంభించింది. శ్రీలంకలోని భారత హైకమిషన్ ఈ విషయాన్ని ట్విటర్‌లో వెల్లడించింది. అక్కడికి వచ్చే భారతీయులకు ఇది మరింత సౌలభ్యాన్ని కల్పిస్తుందని తెలిపింది. శ్రీలంకలోని లంకాపేతో కలిసి తాము ఆపరేట్ చేస్తున్నట్లు ఫోన్ పే ప్రకటించింది. భారతీయులు వారి ఫోన్ పే యాప్‌తో లంకాపే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పే చేయొచ్చని, నగదును వెంటే తీసుకెళ్లనక్కర్లేదని పేర్కొంది.




## నేటి నుంచి టీబీ నియంత్రణకు టీకా

రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 జిల్లాల్లో నేటి నుంచి క్షయ నియంత్రణ టీకా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే హైరిస్క్ ఉన్న బాధితుల గుర్తింపు ప్రక్రియను వైద్యశాఖ పూర్తి చేసింది. టీబీ చరిత్ర కలిగిన వారితో పాటు రోగుల కుటుంబ సభ్యులు, ధూమపానం చేసేవారు, మధుమేహం వ్యాధిగ్రస్థులు, తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ కలిగిన వ్యక్తులకు తొలుత టీకాలు వేస్తారు. 12 జిల్లాల్లో ఈ వర్గాల వారు 50 లక్షల మంది ఉన్నట్లు అంచనా వేశారు.

## ఐదుగురికి పునర్జన్మ ఇచ్చిన మహిళ

తన తల్లి మరణం మరో ఐదుగురికి పునర్జన్మనిస్తుందని తెలుసుకున్న లక్ష్మీదేవమ్మ కుటుంబసభ్యులు.. అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చారు. NIMS హాస్పిటల్‌లో ఆమె చనిపోగా.. 2 కిడ్నీలు, కాలేయం & 2 నేత్రాలను దానం చేసినట్లు 'జీవన్‌దాన్' ట్వీట్ చేసింది. అన్నిదానాల కంటే అవయవదానం ఎంతో గొప్పది. కానీ, దీనికి చాలా మంది ముందుకురారు. దీంతో అవయవాలు అందుబాటులో లేక వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.






## డెంగీకి మరో టీకా

డెంగీ కట్టడికి రూపొందించిన రెండో టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఆసియా, లాటిన్ అమెరికా దేశాల్లో డెంగీ విజృంభణ పెరిగిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ తకెడా ఈ టీకాను అభివృద్ధి చేసింది. దీని పేరు క్యూడెంగా. 6- 16 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులకు దీన్ని ఇవ్వవచ్చని WHO సూచించింది.

## హాట్ బ్యూటీ అషు రెడ్డి

బిగ్ బాస్ గేమ్ షో ద్వారా చాలా మంది పాపులారిటీ సొంతం చేసుకున్న భామల్లో అషు రెడ్డి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన అందంతో ఎంతో మంది కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చింది ఈ చిన్నది. ముఖ్యంగా ఆర్జీవితో బోల్డ్ ఇంటర్వ్యూ చేసి పాపులర్ అయ్యింది అషు రెడ్డి. బిగ్ బాస్ తర్వాత పలు షోలు, ఈవెంట్లు చేస్తూ.. తెగ సందడి చేస్తున్న ఈ మధ్య గ్లామర్ ను మరింతగా పెంచేసింది. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది అషు రెడ్డి. సోషల్ మీడియాలో గ్లామరస్ వీడియో పోస్ట్ చేస్తూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. బిగ్ బాస్ కంటే ముందు కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది ఈ చిన్నది. అలాగే టిక్ టాక్ వీడియోలు చేస్తూ అందరిని ఆకట్టుకుంది. అప్పట్లో ఈ అమ్మడిని జూనియర్ సమంత అని పిలిచేవారు. కానీ అనుకున్నంత గుర్తింపు రాలేదు. బిగ్ బాస్ తర్వాత అయినా సినిమాలతో బిజీ అవుతుందేమో అనుకున్నారు కానీ అలా కూడా జరగలేదు.